నాటినుంచి నేటిదాకా 'స్వతంత్రం' యెదుర్కొన్న రాజకీయ అనుభవాల సంక్షిప్త వ్యంగ్య చిత్రణ



# స్వతంత్రం పాట్లు

కొడవటిగంటి కుటుంబరావు

చిక్కు ఎక్కడొచ్చిందంటే, వాడు 1930 జనవరి 26న పుట్టాడు. వాడి తండ్రి వాడికి తడువుకోకుండా స్వతంత్రం అని పేరు పెట్టాడు.

స్వతంత్రుడి తండ్రి రాజకీయ రంగ స్వతంత్రం తండ్రికే తెలియదు. అతను గర్భదరిద్రుల గర్భాన పుట్టి, మూడెకరాల ఆస్తిగల విధవరాలికి దత్తు పోయాడు. వృత్తిచేత ప్లీడరు గుమాస్తా. ఇతగాడి అదృష్టం బాగుండి ఆ ప్లీడరు గారికి దశ ఎతుకున్నది. ప్లీడరుగారు రెండంతస్తుల మేడ కడితే, ఆ మేడను కొనెయ్యగల మొత్తం ప్లీడరుగుమాస్తా తన చెమట వోడ్చి సంపాదించి, దాన్ని తెలివిగా వడ్డీల కిచ్చాడు. ఆ కారణంగా స్వతంత్రం పుట్టిన వెంట్రుకలు తీయించుకునే లోపల అతని తండ్రి బాకీదార్లనుంచి బాకీల రద్దుకింద పదిహేను ఎకరాల మాగాణీ భూమి, ఒక తోటా సంపాదించాడు.

ఆ మధ్యకాలంలో ఒక ఎన్నికలు జరిగాయి. ఎవరికి వోటెయ్యాలో తెలీక ప్లీడరు గుమాస్తాగారు పదిహేను రూపాయలిచ్చిన వాడికి వోటు వేశాడు.

అది స్వతంత్రం బేక్‌గ్రౌండ్.

స్వతంత్రం తండ్రిలాకాదు. వాళ్లే చాలా మంది. వాడి ఈడువాళ్ళు, భారత స్వాతంత్ర్యం ప్రత్యక్షపతారంగా చూసే వాళ్లు, వాడుకూడా తాను ఒకరాజకీయ జాతక పురుషుణ్ణి అనుకునే వాడు. వాడు ఒకేసారి విప్లవ

తొలిచూపులోనే ప్రేమ పుట్టడం కాదనలేం. కానీ దానికి మలి చూపు. బలం కూడా కావాలి మరికొంత ముందుకు వెళ్ళడానికి.

—హెచ్. విన్సెంట్

నీవు యజమానివైతే. కొన్ని సందర్భాల్లో చూడనట్లు నటించాలి సేవకుడివైతే చెవిటివానిగా నటించాలి.

—పుల్లర్


చర్యల్లో పాల్గొన్నాడు. 1942 ఆగస్టులో కాంగ్రెస్ నాయకులు జైల్లోపడ్డ మర్నాడు స్వతంత్రం ఈడువాళ్ళు ఓ ఇరవై మంది ఆవేశంగా ఊరిమీదపడి షాపులూ, హోటళ్ళూ మూయించి, తిన్నగా రైలు స్టేషనుకు వెళ్ళారు. రైల్వే పోలీసులు తాము దేశ ద్రోహులమనుకున్నట్టుగా విప్లవవీరులు కోరగానే టోపీలు తీసి కింద పెట్టారు. నలుగురితో పాటు స్వతంత్రం కూడా ఒక పోలీసు టోపీని ధైర్యంగా తొక్కాడు. తరువాత బుకింగాఫీసులోకి జొరబడి బాలవీరులు కరెన్సీనోట్లు నేల మీద పోసి తగలబెట్టారు. ఆ హడావుడిలో స్వతంత్రం ఒక నోటు జేబులో పెట్టుకు న్నాడు. ఇంకో నోటు తీస్తుండగా ఎవరో చూసి, వాడిచేతిమీదకొట్టి, నోటులాక్కొని మంటల్లో వేశారు. స్వతంత్రం పైకి తప్పు చేసిన వాడిమొహం పెట్టాడేగాని, లక్ష్మి దేవిని తగలెయ్యడంలో దేశభక్తి ఏమున్నదో వాడికి తెలీలేదు.

ఆటు తరవాత స్వతంత్రం జాతీయ. అంతర్జాతీయ రాజకీయసంఘటనలలో ఆసక్తి కనబరచాడు గాని. రాజకీయ పార్టీలలోనూ వాటి ఆశయాలలోనూ ఆసక్తి యెంతమాత్రమూ కనబరచలేదు.

యుద్ధం యెప్పుడు ప్రారంభమైనదీ వాడికి గుర్తు రాలేదు. వాడి జీవితాన్ని అది యేవిధంగానూ స్పృశించినట్టు కనబడ లేదు. కాని రష్యా అన్నమాట జనాల నోళ్ళలో నానసాగింది. రష్యా గురించి పెద్దలు చాలా నీచంగా చెప్పారు. పిన్నలు గొప్పగా చెప్పారు. పెద్దవాళ్ళమాటే వాడికి నిజం కావచ్చు ననిపించింది.

"అవునండీ, జర్మనీ గెలవాల్సిందే ఆ హిట్లరు గెలిస్తే ఆర్యధర్మం తిరిగి ఈ గడ్డమీద నాలుగు పాదాలా నడుస్తుంది." అని ఒక శాస్త్రుల్లుగారు తన తండ్రితో అనటం వాడు విన్నాడు. అదీ నిజమే ననిపించింది. హిట్లరు ఆర్యుడట! అనార్యులను వేటాడుతున్నాడు. శ్రీరామ చంద్రులవారు వారిని వేటాడినట్లు! రాక్షసుల్ని వేటాడినట్లు.

"ఓ వేళ రాముడే హిట్లరుగా పుట్టలేదు గదా?" అని స్వతంత్రం తాను ఆశ్చర్య పడి కొద్ది మంది ఆంతరంగికులతో అన్నాడు కూడా. వాళ్ళు విరగబడి నవ్వే సరికి స్వతంత్రం నిరుత్సాహపడి ఆ ఐడియాను శీఘ్రమే మరిచిపోయాడు. రాముడికి మీసాలుండేవా? లేక పేడిమూతివాడా? ఏమో?




హిట్లరు గెలవాలన్న వాళ్ళకీ, వాడు చావాలన్న వాళ్ళకీ ఏదో శత్రుత్వం వున్నట్లు స్వతంత్రం తెలుసుకుని, ఎవరితోనూ విరోధం పెట్టుకోవటం ఇష్టంలేక, తాను తటస్థంగా వుండిపోయాడు.

చివరకు హిట్లరు ఆత్మహత్య చేసుకుని - రాముడు ఎలా చచ్చాడు? — యుద్ధంలో రష్యా గొప్పగా గెలిచి, అమెరికా బ్రిటనులు కూడా రష్యాను పొగుడుతున్నట్లు విని. స్వతంత్రం తానుకూడా రష్యాను పొగుడుదామనుకున్నాడు.

కాని త్వరలోనే అమెరికా, బ్రిటనులు. రష్యాపట్ల ద్వేషమూ. ఓడిన జర్మనీపట్ల స్నేహమూ చూపుతున్నట్లు తెలిసి. స్వతంత్రం "కూర్మంలాగా" ముడుచుకుపోయాడు.

వాడి రాజకీయ ఆదర్శం— "గెలిచిన వాడిపక్షం వుండు" యుద్ధానంతరకాలంలో క్రమంగా రూపుదాల్చింది.

దేశ విభజన జరిగింది. మతకలహాలతో ఎక్కడో నెత్తురు ఏర్లుకట్టి పారిందన్నారు. ఇవేవీ స్వతంత్రాన్ని స్పృశించలేదు.

స్వతంత్రమే వచ్చింది. 1947 ఆగస్ట్ 15న. కాని మన స్వతంత్రం వున్నచోటనే వుండిపోయాడు. కమ్యూనిస్టులూ, సోషలిస్టులూ, హిందూమహాసభవాళ్ళూ, ఇంకెవరెవరో వెనక్కుపోయి కాంగ్రెసు పైకి తేలింది. ఘటనలరీత్యా కాంగ్రెసు సత్యం. మిగిలిన పార్టీలు మిథ్య!

మొదటిసారి యెలెక్షన్లు జరిగేనాటికి స్వతంత్రానికి ఓటున్నది. దాన్ని కాంగ్రెసుకు వేశాడు.

ఎవరో వాక్శుద్ధిగల కవి. "ఒక్కసారి మంత్రిచెయ్యి.గణనాథా! నువ్వుఓడకుంటె ఒట్టుపెట్టు గణనాథా!" అన్నట్టుగా కాంగ్రెసు మంత్రులు కుర్రాళ్ళ రాళ్ళకు చింతకాయలు రాలినట్టు రాలారు.

"కమ్యూనిస్టులను బొత్తిగా తోసి పారెయ్యకూడదు లాగుందే!" అనుకుని స్వతంత్రం వాళ్ళను గురించి మరీ సలీసుగా మాట్లాడటం తగ్గించాడు.

రెండో సాధారణ ఎన్నికలు జరిగి, తాను వోటు చేసిన కాంగ్రెసు అభ్యర్థికి డిపాజిట్టు పోయిన అనంతరం, తాను రాజకీయ మహానాయకుడు ఎప్పటికైనా అయి తీరాలనీ. అప్పుడుగాని తన జన్మతారకూ నామ నక్షత్రానికీ సార్థక్యం ఉండదనీ స్వతంత్రానికి అనిపించింది.

కాని ఎలా? రాజకీయాలు తప్పుల తక్కెడగా ఉంటున్నాయి. గెలిచినవాళ్ళు ఓడుతున్నారు, ఓడిన వాళ్ళు గెలుస్తున్నారు. ఇలా ఎల్లకాలమూ వుంటుందా? బ్రిటిషు

వాళ్ళ హయాంలో దశాబ్దాలపాటు పరిస్థితులు మారేవికాదుట. వాళ్ళనాన్న ఎన్నో సార్లు అన్నాడు

మళ్ళీ అలాటి పరిస్థితి రావాలి! తాను గద్దె ఎక్కాలి!

"ఆ బ్రిటిషు వెధవలు ఎందుకు వెళ్ళిపోయారు? పోనీ, మళ్ళీ రారాదూ? నాకేమన్నా ఛాన్సుంటుందేమో!" అనుకున్నాడు స్వతంత్రం. తన పేరుకు అర్థం కూడా పాటించకుండా, కాలక్రమాన దేశాన్ని పాలించేవారంతా వాడికన్న అర్థరహితంగా ఆలోచించసాగారు గనక మనం మన స్వతంత్రాన్ని తప్పు పట్టరాదు. కడుపు చించుకుంటే కాళ్ళమీదపడుతుంది.

రానురాను స్వతంత్రానికి ఒకటి స్పష్టమయింది. కాంగ్రెసుకు తాను ఊహించినంత గొప్ప భవిష్యత్తు వుండకపోవచ్చు. రాజాజీలాంటి వాళ్ళు బయటికి పోయారంటే అంతేగా?" కాని కమ్యూనిస్టులకు భవిష్యత్తు అసలే లేదు. వాళ్ళు అండర్ గ్రౌండ్ పోవటమూ, మళ్ళీ బయటికి రావటమూ, కాస్సేపు విప్లవం అనటమూ ఎన్నికలకు నిలబడటమూ. రెండుగా చీలటమూ, మళ్ళీ మూడుగా చీలటమూ ఇదంతా అభ్యుదయ లక్షణం కాదు.

స్వతంత్రం మనస్సులో ఇంకా ఏ మూలనన్నా సందేహం వుంటే, నక్సలైట్ల మూలంగా అది పూర్తిగా పోయింది స్వతంత్రం తండ్రి పోయాడు. వాడి తమ్ముడు నక్సలైట్ అయినాడని స్వతంత్రం అను[illegible]. పెళ్ళి కావలసిన చెల్లెలు యిరవై నాలుగేళ్ళది వున్నది. కట్నాలు పొయ్యటం సంఘ ద్రోహమని స్వతంత్రం నమ్మకం. కట్నం లేకుండా ఆమెను పెళ్ళి చేసుకుంటానని వొకడు-ఒకే వొకడు-వచ్చాడు. వాడు తన తమ్ముడి స్నేహితుడు. తప్పక నక్సలైట్ అయి వుంటాడు. స్వతంత్రం వొప్పుకోలేదు.

ఒక శుభ ముహూర్తాన ఆ పిల్ల యింటి నుంచి లేచిపోయి, వర్ణాంతర వివాహం చేసుకున్నది. స్వతంత్రం హాయిగా వూపిరి పీల్చుకున్నాడు.

"నాకు సంఘసంస్కారం చాలాఇష్టం. నా చెల్లెలు...." అని విన్న వారందరికీ చెప్పాడు. వాడు తన చెల్లెల్ని వెలివెయ్యలేదు. ఆమెను పెళ్ళాడినవాడు డబ్బున్నవాడు అడపాదడపా స్వతంత్రానికి వడ్డీకి అప్పులిచ్చేవాడు.

ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ కాలంలో స్వతంత్రం దేశ పరిస్థితులను గురించి ఆలోచించటం మాని తన గృహ పరిస్థితులను గురించి ఆలోచించే అవకాశం వచ్చింది. తన చెల్లెల్ని కట్నం లేకుండా పెళ్ళాడతానన్న వాణ్ణే ఇందిరా గాంధి జైల్లో పెట్టించింది వాణ్ణే నిరాకరించిన తన దూరదృష్టిని స్వతంత్రం ఎంతైనా మెచ్చుకున్నాడు.

అతను కాక ఇంకా ఎవరెవరో జైలుకు పోయారుట. ఆ వివరాలు తెలుసుకునే అవకాశం వాడికి లేదు. పిల్లలకు చదువు సాగటం లేదు. బళ్ళలో ప్రవేశపెట్టటమే గగనంగా ఉన్నది. వర్ణాంతర బావమరిది ఒక్కొక్క ఎకరమే రాయించుకుని, మళ్ళీ అప్పులిస్తున్నాడు. స్వతంత్రం తీసుకుంటున్నాడు. లేకపోతే జరగటం లేదే!

ఇప్పుడు స్వతంత్రం ఒక్క విషయం గమనించాడు. మంచో, చెడో ఒక్క రాజకీయ పార్టీకి అంటిపెట్టుకున్నవాళ్ళు బాగు పడుతున్నారు. ఆ పార్టీవాళ్లు శాసన సభలోకో, లోక్‌సభలోకో ఎప్పటికైనా రాకపోరు. రేసులో ప్రతిసారీ ఒకే నెంబరు మీద కాసినవాడు ఎప్పుడోప్పుడు డబ్బు కొడతాడు.

> సాహస కృత్యాలు వెదజల్లే పరిమళమే కీర్తి.
>
> —సోక్రటీస్
>
> ఏ పుస్తకమైనా మొదటిసారి చదవడం క్రొత్త స్నేహితునితో పరిచయం వంటిది. రెండవమారు అదే పుస్తకం చదవడం పాత స్నేహితుని కలుసుకోవడం వంటిది.
>
> —ఎస్. జి. చాంపియన్

మరి స్వతంత్రం డబ్బు ఖర్చుచేసి ప్రతి రేసుకూ వెళ్ళి, దేనిమీదా కాయని వాడుగా ఉండిపోతున్నాడు.

ఇందిరాగాంధీ శకం ముగియగానే ఏదో పార్టీలో చేరి తీరాలిసిందేనని స్వతంత్రం ఘట్టిగా అనుకున్నాడు. జనతాపార్టీ బాగుంది. అందులో అమాంబాపతుపార్టీలు చాలా వున్నాయి. ఎందులో చేరినా జనతాలో వున్నట్టే.

"జనతాపార్టీ గెలుపు చూసి మోసపోకు. ఇది ఇందిరాగాంధీ అపజయం; జనతా విజయం కాదు. జనతాపార్టీ అంటూ లేదు. అందులో చేరిన ఏ రాజకీయ పార్టీకూడా రద్దు కాలేదు. వీళ్ళు తమ గెలుపును పంచుకోవటంలో కొట్టుకు చస్తారు" అని రైలు స్టేషనులో ఎవరో ఇంకెవరితోనో అంటుంటే స్వతంత్రం విన్నాడు.

వాడు క్రియకు ఏ పార్టీలోనూ చేరలేదు. కాని మానసికంగా తాను జనతాపార్టీ వాణ్ణే అనుకున్నాడు.

జనతా పార్టీలో ముసలం పుట్టింది. దాని పుట్టుకకు పురుడుపోసినవారిలో ముఖ్యమంత్రసానులను కుర్చీలలోనుంచి లేపారు. కాని అది స్వతంత్రాన్ని బాధించలేదు.

కాని జనతాపార్టీయే రెండుగా చీలినప్పుడు స్వతంత్రం నిర్ఘాంతపోయాడు తాను మానసికంగా ఏ పార్టీలో వున్నట్టు? రెండు జనతా పార్టీలూ అధ్యక్షుడికి తమ పార్టీ బలాల జాబితాలు యిచ్చాయి. రెండు జాబితాల్లోనూ తన పేరువున్నట్టు స్వతంత్రం ఊహించుకున్నాడు.

అయితే తనపేరు మొరార్జీ జాబితాలో పొరపాటున చేరినట్టు స్పష్టమయింది! అది చరణ్‌సింగ్ జనతాలోనే ఉన్నది! భయం లేదు. తాను జనతా (ఎస్) పార్టీయే.

అయితే చరణ్‌సింగ్ స్వతంత్రానికి భయం కలిగించే పనిచేశాడు. ఇందిరతో పొత్తుకుదుర్చుకున్నాడు. జనతా కేంద్రంలో గద్దె ఎక్కినప్పటినుంచీ తాను మానసికంగా ఇందిరను నానా మాటలూ అన్నట్టు స్వతంత్రానికి గుర్తు వచ్చింది.

అయినా ఫర్వాలేదు. ఇందిరచేత జైల్లో తోయించుకున్నవాళ్ళే ఆవిణ్ణి చంక నెక్కించుకుంటే మధ్య తనకు మొహమోటం దేనికి?

అయితే చరణ్‌సింగు చంక నెక్కినట్టు కనబడిన ఇందిర అతన్ని డొక్కలో తన్ని చంక దిగింది. రెండో జనతా వాళ్ళు పూలమాలలతో ఇందిర వద్దకు వెళుతున్నారు-

అన్ని పార్టీలూ అబద్ధమే- కాంగ్రెసు కూడా! ఇందిర ఒక్కతే సత్యం!

స్వతంత్రం మానసికంగా ఇందిరతో చేరిపోయాడు.

ఇంతలో పాతఎన్నికలు రద్దయి తిరిగి ఎన్నికలు జరుగుతాయంటున్నారు. మళ్ళీ అంతా అనుమానంలో పడింది.

ఎవరు గెలుస్తారు? ఎవరు గద్దెలెక్కుతారు. స్వతంత్రం మానసికంగా యెవరితో చేరాలి.?

ఎవరికైనా తెలిస్తే వాడికో కార్డుముక్క రాసి, పుణ్యం కట్టుకోండి వాడి పొలమంతా వర్ణాంతరుడు లాక్కున్నాడు. వాడి సొంతచెల్లెలే వర్ణాంతరుడి పక్షమయింది. వాడు ఆర్థిక యిబ్బందుల్లో వున్నాడు. రాజకీయాలతో డబ్బు గడించటం అన్నిటికన్నా సర్వోత్తమమైన మార్గం. రాజకీయ పరిశ్రమముందు ఏ పరిశ్రమా నిలవలేదు

స్వతంత్రాన్ని ఆర్థికంగా గట్టెక్కించండి.